క్లుప్తంగా

వర్మీ కంపోస్ట్ తయారు చేయండి



గొట్టివలస ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

గరుగుబిల్లి : ఎస్‌డబ్ల్యూపీసీ(సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్)ల ద్వారా వర్మీ కంపోస్ట్(ఎరువు) తయారు చేయాలని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు సూచించారు. మండలంలోని గొట్టివలస గ్రామంలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీని శుక్రవారం పరిశీలించిన ఆయన.. అక్టోబరు 2వ తేదీ నాటికి ఎస్‌డబ్ల్యూపీసీ యూనిట్ల దగ్గర నుంచి వర్మీ కంపోస్ట్‌ను తయారు చేసి వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆరు, ప్రథమ ఇంటర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్ విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ప్రిన్సిపాల్ డి.శివకుమార్, వైస్ ప్రిన్స్‌పాల్ బాబూరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సామూహిక భోజనాలు చేశారు.

ఐదు శాతం రిజర్వేషన్లు పెంచాలి



బత్తిలి బస్టాండ్‌లో చేపట్టిన మానవహారంలో పాల్గొన్న రెల్లి ఉప కులాల ప్రజలు

భామిని: ఎస్సీ వర్గీకరణలో రెల్లి ఉప కులాలకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని రెల్లి గర్జన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బత్తిలిలో రెల్లి ఉప కులాల నాయకులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెల్లి సంఘ నాయకులు రాగోలు అశోక్, బంగారి సుధాకర్, తదితరులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు స్వాగతిస్తున్నామని, అయితే తమకు న్యాయం చేయాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందన్నారు. ఉప కులాల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

పరామర్శ



మృతుడు కుమారుడు సన్యాసిరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: హడ్డుబంగి పంచాయతీ పనసగూడకు చెందిన సవర పెద్దజగ్గడు ఇటీవల పొలానికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం పరామర్శించారు. మృతుడి కుమారుడు ఎస్.సన్యాసిరావును ఓదార్చారు. ఈమె వెంట ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్, మంగయ్య, ఎస్.రాము, తవిటిరాజు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



కొత్తూరులో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: మండలంలోని కొత్తూరు గ్రామంలో సైబర్ నేరాలు, వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు మాట్లాడుతూ తెలియని ఫోన్ నంబర్‌ల ద్వారా సందేశాలకు స్పందించవద్దని, ఫోన్‌కు వచ్చిన ఓటీపీ(వన్‌టైన్ పాస్‌వర్డ్)ని ఎవరికీ చెప్పవద్దన్నారు. ఏ ఫోన్ నంబర్ నుంచి ఇబ్బందికరమైన ఫోన్లు వస్తే టోల్ ఫ్రీ నంబర్ 1930ను సంప్రదించాలని కోరారు. సైబర్ నేరగాళ్లు తప్పుడు ఫోన్‌కాల్స్, మెసేజ్‌లతో మనల్ని తప్పుదోవ పట్టించి, బ్యాంకు ఖాతాలోని సొమ్మును దోచేస్తారని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేలకొరిగిన అరటి, మొక్కజొన్న

మక్కువ: ఈదురుగాలుల బీభత్సానికి అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. మండలంలోని శంబర గ్రామ సమీపంలో గురువారం రాత్రి వీచిన గాలులకు తోడు వర్షం భారీగా కురవడంతో అరటి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. అప్పులు చేసి, పండించిన పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తమ పంటలకు పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితులు కూడా లేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గరుగుబిల్లి: గణేశుని విగ్రహాన్ని తరలిస్తున్న కమిటీ సభ్యులు



వీరఘట్టం: గ్రామాలకు తరలిపోతున్న వినాయక విగ్రహాలు



భామిని: వాహనంపై విగ్రహాన్ని తరలిస్తున్న యువత



వీరఘట్టం: స్వీట్ షాపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చవితి లడ్డులూ

మార్కెట్ కళకళ..

- వినాయక చవితి నేపథ్యంలో కిటకిటలాడిన దుకాణాలు
- పూలు, పండ్లు, విగ్రహాల కొనుగోలుతో సందడి వాతావరణం

వీరఘట్టం: మండల కేంద్రంలోని ప్రధాన మార్కెట్ వినాయక చవితి శోభతో శుక్రవారం కళకళలాడింది. పూలు, పండ్లు, విగ్రహాలు కొనుగోలుకు ప్రజలు అధిక సంఖ్యలో రావడంతో ప్రతి దుకాణం వినియోగదారులతో కిటకిటలాడింది. స్వీట్‌షాపుల్లో కూడా ప్రత్యేకంగా తయారు చేసిన లడ్డూలు విక్రయించారు. అలాగే ఉత్సవ కమిటీ సభ్యులు తొలి పూజకు అవసరమైన ఉసిరి, మారేడు, జామ, తులసి, తదితర పత్రులను సమకూర్చడంలో నిమగ్నమయ్యారు. గ్రామీణ ప్రాంతాల వారు మార్కెట్‌లో కొనుగోలు చేసిన వినాయక విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో తమ గ్రామాలకు తరలించారు. ఇలా వినాయక చవితి శోభతో వీరఘట్టం మార్కెట్ రద్దీగా మారింది.

తొలిపూజకు సర్వం సిద్ధం..

వినాయక చవితి ఉత్సవాలకు ప్రజలు, యువత సర్వం సిద్ధం చేశారు. శనివారం జరగనున్న ఉత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. వీరఘట్టంలోని ముచ్చర్లవీధి, కొత్తబస్టాండ్, కాలేజ్ జంక్షన్, వడ్డివీధి, , సెగిడివీధి, కొండవీధి, బార్నాలవీధి, కూరాకుల వీధి, బీసీ కాలనీ, గొడువీధి, గెంబలివీధి, రాజుగారి వీధి, తెలగవీధుల్లో ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు మంటపాలను సుందరంగా తీర్చిదిద్దారు.

ప్రధాన మార్కెట్‌కు చవితి కళ..

పాలకొండ రూరల్: వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని పాలకొండ ప్రధాన మార్కెట్‌లో సందడి నెలకుంది. ముఖ్యంగా మండల పరిధిలోని పలు పంచాయతీలకు చెందిన ప్రజలు చవితి పూజకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేయడంతో మార్కెట్ కిక్కిరిపోయింది. పండ్లు, పూలకు గిరాకీ పెరిగింది. మరోవైపు వినాయక విగ్రహాలను మంటపాలకు తరలించే క్రమంలో యువత సందడి చేశారు. జై గణేష్ నామస్మరణతో విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై ఉత్సవ కమిటీ సభ్యులు తమ తమ గ్రామాలకు తరలించారు.



పాలకొండ రూరల్: మార్కెట్‌లో జనసందోహం



వీరఘట్టం: పూజాసామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న వీరఘట్టం మార్కెట్



వీరఘట్టం: మార్కెట్‌లో పత్రి, పండ్లు కొనుగోలు చేస్తున్న స్థానికులు

చెరువులను అభివృద్ధి చేస్తాం..

పాలకొండ రూరల్: చెరువులను అభివృద్ధి చేసే క్రమంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళతామని మండలంలోని లుంబూరు గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘ ఉపాధ్యక్షుడు తిర్లంగి ఉపేంద్రకుమార్ అన్నారు. గ్రామానికి చెందిన ఎర్రకువ్వన్న చెరువులో గంబూషియా చేపపిల్లను శుక్రవారం పంచాయతీ పాలక సభ్యులతో కలసి విడిచిపెట్టారు. ఈ చేప పిల్లలు చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను, దోమలకు సంబంధించిన లార్వాలను ఆహారంగా తీసుకుని చెరువులో మలినాలను నియంత్రిస్తాయన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పడాల రామచంద్రరావు, ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణపావని, ఏఎన్‌ఎం ఢిల్లీశ్వరి, పాల్గొన్నారు.



ఎర్రకువ్వన్న చెరువులో గంబూషియా చేపపిల్లలను విడిచిపెడుతున్న ప్రజా ప్రతినిధులు, క్షేత్రస్థాయి సిబ్బంది

భయపెడుతున్న శునకాలు..



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద హల్‌చల్ చేస్తున్న శునకాల గుంపు

పాలకొండ రూరల్: సీజన్ ప్రభావమో లేక ఇతర ప్రాంతాలకు చెందిన కుక్కలు ఇక్కడ విడిచిపెడుతున్నారో తెలియదు గాని పట్టణంలో ఎక్కడ చూసినా శునకాల గుంపులు హల్‌చల్ చేస్తూ స్థానికులను హడలెత్తిస్తున్నాయి. జన సమీకరణ ఎక్కడ ఎక్కువగా ఉంటే అక్కడే ఈ కుక్కల గుంపులు చేరి ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఇప్పటికే పలువురిపై దాడి చేయడంతో స్థానికులు నగర పంచాయితీ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ముఖ్యంగా పాలకొండ – శ్రీకాకుళం రహదారి, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శునకాల కదలికలు ఎక్కువగా ఉన్నాయి. నగర పంచాయతీ అధికారులు కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పండుగ ఆనందంగా జరుపుకోవాలి..

వీరఘట్టం: నాయక ఉత్సవాలను ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద పలువురు ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన మాట్లాడారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించాలన్నారు. అలాగే పలు ప్రధాన జంక్షన్‌లలో ఎన్ని రోజులు ఉత్సవాలు నిర్వహిస్తారు..నిర్వాహకులు ఎవరు.. రాత్రి పూట మంటపాల వద్ద ఎవరు ఉంటారన్న వివరాలపై ఆరా తీశారు.



ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్సై కళాధర్

తుఫాన్‌పై అప్రమత్తం..

భామిని: అల్పపీడనం ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న సమాచారం మేరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నిమ్మల శేఖరం అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వంశధార నదీతీరంలో వరద ప్రాంతాలపై దృష్టి సారించాలన్నారు. వినాయక ఉత్సవాలు, నిమజ్జనంలో అపశృతులు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.చంద్రరావు, ఎంఏఓ కె.సింహాచలం, ఈఓపీఆర్‌డీ కృష్ణారావు, ఏఎస్సై కాంతారావు, ఆర్‌ఐ రాంబాబు, వీఆర్‌ఓలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శేఖరం

అప్రమత్తంగా ఉండాలి

వీరఘట్టం: రానున్న రెండు రోజుల్లో తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నందున అధికారులంతా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో పోలీస్, జలవనరుల శాఖ, మండల పరిషత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాలు భారీగా కురిస్తే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగించుకోవాలని సూచించారు.



వీరఘట్టం: అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మహిళల్లో రక్తహీనత నివారణకు కృషి

పార్వతీపురం టౌన్: మహిళలు, బాలికలలో రక్తహీనత నివారణ, పిల్లల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం సక్రమంగా అందేటట్టు చూడాలని ప్రత్యేక అధికారి, డివిజనల్ అభివృద్ధి అధికారి ఎస్.రమేష్ రామన్ తెలిపారు. స్థానిక మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో పార్వతీపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మహిళలు, పిల్లల రక్షణ చట్టాలు, హక్కులు, పోషకాహారం సరఫరాపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, పిల్లల సంక్షేమం, రక్షణ కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. పార్వతీపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు పోషణ్ అభియాన్‌పై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం విద్య ప్రాముఖ్యత, లైంగిక వేధింపుల నిరోధక చట్టం, వరకట్న నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు.

కొటికపెంట ఏకలవ్య పాఠశాల విద్యార్థుల తరలింపు

గుమ్మలక్ష్మీపురం: సాలూరు నియోజకవర్గంలోని పాచిపెంట మండలంలోని కొటికపెంట ఏకలవ్య పాఠశాల 6, 7, 8 తరగతుల విద్యార్థులను గుమ్మలక్ష్మీపురంలోని ఏకలవ్య పాఠశాలకు శుక్రవారం తరలించారు. అక్కడి పాఠశాల భవన నిర్మాణ పనులు జరుగుతుండడంతో విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొత్తం 180 మంది విద్యార్థులు ఇక్కడికి పంపించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.పెంటన్న తెలిపారు. ఈ విద్యాసంవత్సరం పూర్తయ్యేంత వరకు విద్యార్థులు ఇక్కడే కొనసాగుతారన్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు



కళావతి, మాజీ ఎమ్మెల్యే

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గ ప్రజలందిరికీ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వండువలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ప్రజలంతా సుఖ,సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం టౌన్: జిల్లాలో క్రీడలను అన్ని విధాల ముందుకు తీసుకువెళ్తున్న వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుదేవరావునాయుడు కోరారు. ఈ మేరకు డీఈఓ జి.పగడాలమ్మకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా క్రీడల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టాలని కోరారు. క్రీడల అభివృద్ధికి రావాల్సిన నిధులు తొందరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

వైద్య సేవలను పర్యవేక్షించండి

సీతానగరం: గ్రామాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను వైద్యాధికారులు, సూపరువైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.జగన్మోహనరావు సూచించారు. సీతానగరం ఆర్‌సీహెచ్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులలో రోగుల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది రోగులు శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు ఉన్నారన్నారు. ఇక్కడి నుండి వైద్య సేవలందిస్తున్న రోగులను సూపరువైజర్లు తప్పనిసరిగా పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో సీజనల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నట్లు వస్తున్న సమాచారం మేరకు జ్వరాలున్న గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. తక్కువ కాలపరిమితి ఉన్న మందుల ఇచ్చే సమయాన్ని పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఉచిత వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సిబ్బంది పీహెచ్‌సీకి అందుబాటులో ఉండాలని, అత్యవసర సేవలందించడానికి సిద్ధం కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ పావని, సూపరువజర్లు, టెక్నీషియన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులోకి గంబూషియా చేపల విడుదల

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని కోనేటి చెరువులో గంబూషియా చేపలను అధికారులు శుక్రవారం విడిచిపెట్టారు. వర్షాకాలం నేపథ్యంలో దోమలు పెరగకుండా ఈ చేపలను విడిచిపెట్టినట్లు సర్పంచ్ బి.గౌరీశంకరరావు తెలిపారు. ఈ చేపలు దోమల లార్వాలను తినివేసి, దోమలు వ్యాప్తి చెందకుండా చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం అలేఖ్య, హెల్త్ అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గంబూషియా చేపలను చెరువులోకి విడిచిపెడుతున్న దృశ్యం

యువ ఐఏఎస్ అధికారినే నియమించాలి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏ పీవోగా యువ ఐఏఎస్ అధికారినే నియమించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక విలేకరులతో శుక్రవారం మాట్లాడిన ఆయన.. ఇక్కడి ఐటీడీఏ పీవోగా వచ్చిన యువ ఐఏఎస్ అధికారి ఎస్.సేధు మాధవన్‌ను కొన్నిరోజుల్లోనే బదిలీ చేయడం అన్యాయమన్నారు. యువ అధికారులైతే క్షేత్రస్థాయిలో మారుమూల గిరిజన గ్రామాలను సైతం సందర్శించి, అక్కడి వారి సమస్యలపై బాగా స్పందించగలుతారన్న అభిప్రాయం అందరిలో ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించి, యువ ఐఏఎస్ అధికారిని పీవోగా పంపించాలని విజ్ఞప్తి చేశారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

పాలకొండ రూరల్: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారి సిమ్మాలమ్మ అన్నారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మండలంలోని బుక్కూరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతం చేపట్టారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దశారత్నం, టి.మేరి, అంగన్‌వాడీ, ఆశా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని కొమరాడ ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మనం రోజువారీ తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఎల్.పాత్రుడు తెలిపా రు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆర్.లక్ష్మి, పి.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ రూరల్: పౌష్టికాహార అవశ్యకతను వివరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, తదితరులు

రోగులకు సరిపడా పడకలు వేయాలి

సీతంపేట: స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో రోగులకు సరిపడా బెడ్లు వేయడంతో పాటు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక ఆస్పత్రి వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆస్పత్రి నుంచి రిఫరల్ కేసులు తగ్గించాలన్నారు. బ్లడ్ బ్యాంక్, రోగులకు నాణ్యమైన భోజనం, తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.తిరుపతిరావు, సాంబయ్య, శ్రీరాములు, సుందరమ్మ, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు